వరికోతలు ఆరంభం

- యంత్రాలతో పంట కోయిస్తున్న రైతులు
- అల్పపీడన హెచ్చరికలతో రైతుల్లో గుబులు


యంత్రాల సహాయంతో పంట కోయిస్తున్న రైతులు

గూడూరు: మండలంలో ఖరీఫ్ వరికోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని రామరాజుపాలెం, కోకనారాయణపాలెం గ్రామాల్లో వరిసాగు చేస్తున్న రైతులు గత రెండు రోజులుగా పంట కోత మొదలు పెట్టేశారు. ఈనెల 6,7 తేదీలలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తం అవుతున్నారు. కోత దశకు చేరుకున్న పంటను సురక్షితంగా ఇంటికి చేర్చుకుందామన్న ఆలోచనతో ముందుగానే కోస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

19వేల ఎకరాలలో వరిసాగు

మండలంలో 27 పంచాయతీలు ఉండగా దాదాపు 19,166 ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. బీపీటీ రకం ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు బీపీటీ సాగుకే మొగ్గు చూపుతుంటారు. అయితే పంట చేతికందే సమయంలో ఏ మాత్రం పంట నీట మునిగినా రంగు మారిపోవడం, కుళ్లిపోయే పరిస్థితి ఉండటంతో రైతులు వీలైనంత త్వరగా పంట నూర్చివేయాలన్న ఆలోచన చేస్తున్నారు. రామరాజుపాలెం, కోకనారాయణపాలెం గ్రామాల్లో కోతలు ప్రారంభమైనప్పటికీ మరో వారం పది రోజుల్లో మండలంలో వరికోతలు ఊపందుకునే అవకాశం ఉంది.

యంత్రాలకు డిమాండ్

సాధారణంగా ఖరీఫ్‌లో వరి పంటను రైతులు కూలీలతో కోత కోయిస్తుంటారు. ఖరీఫ్‌లో పంట కోసిన తర్వాత వచ్చే ఎండు గడ్డి పశువులకు మేతగా ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే దీనికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. యంత్రాలతో పంట కోతలు నిర్వహిస్తే గడ్డి పనికి రాదు. అయినప్పటికీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంట ఇంటికి చేరితే చాలన్నట్లుగా రైతులు యంత్రాల సాయంతో పంట నూర్పేస్తున్నారు. దీంతో యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. గంటకు రూ.2500 నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నారు.


కోసిన పంటను రోడ్డు వెంబడి రాశులుగా గుమ్మరిస్తున్న వరికోత యంత్రం

కృష్ణాతీరాన కార్తిక పుణ్యస్నానాలు

- శివలింగానికి స్వీయ అభిషేకాలతో భక్తుల పరవశం
- కార్తిక తొలి సోమవారపు వత్తులు వెలిగించిన మహిళలు


నాగాయలంక శ్రీరామపాద క్షేత్రంలో రామలింగేశ్వరునికి అభిషేక పూజలో భక్తులు


శ్రీరామపాదక్షేత్రం వద్ద నది ఒడ్డున కార్తిక వత్తులతో పూజలు చేస్తున్న భక్తులు

నాగాయలంక: కార్తిక మాసంలో తొలి సోమవారం స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలో తెల్లవారుజాము నుంచే భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు పుణ్యస్నానాలు చేశారు. నదిలోని మండపంలో శ్రీరామలింగేశ్వర శివలింగానికి అభిషేకాలు చేశారు. నదీతీరాన భారీ శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలవడం, భక్తులందరికీ అభిషేకాల అవకాశం కలిగించడంతో భక్తి కోలాహలం నెలకొంది. స్నానాలనంతరం నది ఒడ్డున సంప్రదాయ రీతిలో కార్తిక వత్తులు వెలిగించి పూజా ద్రవ్యాలను కృష్ణా నదికి సమర్పించారు. శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ చిట్టా సాంబ శివరావు పర్యవేక్షణలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు అభిషేకాలు జరిపారు. మండలంలోని సంగమేశ్వరం శ్రీగంగా పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానం, గణపేశ్వరంలోని శ్రీదుర్గా గణపేశ్వరస్వామి ఆలయం, భావదేవరపల్లిలోని శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

పెడన: పట్టణంలోని శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానంతో పాటు మండల వ్యాప్తంగా పలు శైవక్షేత్రాలు కార్తికమాసం మొదటి సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు దీపాలను వెలిగించి, శివునికి అభిషేకాలు చేయించారు. అగస్త్యేశ్వర స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

శైవక్షేత్రాల్లో కార్తిక సందడి

కోడూరు: కోడూరు పార్వతీ సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో లింగాకారుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ లక్ష బిల్వార్చన జరిపారు. విశ్వనాథపల్లి కాశీవిశ్వేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో అలంకారం చేశారు. లింగారెడ్డిపాలెం గోకర్ణేశ్వరస్వామి, మాచవరం రామేశ్వరస్వామి, సాలెంపాలెం ఆగస్త్యేశ్వరస్వామి, వేణుగోపాలపురం అమరలింగేశ్వరస్వామి, పిట్టల్లంక బాలనాగేశ్వరస్వామి, హంసలదీవి కాశీ విశ్వేశ్వరస్వామివారి ఆలయాల్లో స్వామివార్లకు పంచామృతాభిషేకాలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: మండలంలోని శివాలయాల్లో సోమవారం భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు విచ్చేసి దీపాలు వెలిగించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలో కార్తిక నోములు నోచుకున్నారు.

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను: కృత్తివెన్ను శ్రీ దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంతో పాటు చినపాండ్రాకలోని శ్రీ మార్కండేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దంపతులు స్వామివారికి అభిషేక పూజలు జరిపారు. కృత్తివెన్నులో మూల విరాట్‌కు చేసిన క్షీరాభిషేకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

పెదకళ్లేపల్లిలో...

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో మహాశివునికి ఆలయ అర్చకులు బుద్దు ప్రసాద్ ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.


పెడన శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

ఆలయాల్లో కార్తిక సోమవారం పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శైవక్షేత్రాల్లో కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే తలారా స్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి స్వామివారికి అభిషేకాలు చేసి దీపాలు వెలిగించి పూజలు చేశారు. నగరంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు గొడుగుపేట, బచ్చుపేట, ఖోజ్జిల్లిపేట, గాంధీబొమ్మ శివాలయంలో పూజలు చేశారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో 108 లీటర్ల ఆవుపాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

రామాలయంలో కార్తిక దీపారాధన

మోపిదేవి: మోపిదేవి రామాలయంలో సోమవారం కార్తిక దీపారాధన నిర్వహించారు. మహిళలు ఆలయం లోపల కార్తికదీపాలు వెలిగించారు. ఆలయం బయట ఓం, స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగించి భక్తిభావాన్ని చాటుకున్నారు.


పెదకళ్లేపల్లిలో నాగేంద్రునికి అభిషేకం


కృత్తివెన్ను శివాలయంలో స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు


మచిలీపట్నంలో స్వామివారికి ఆవుపాలతో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

దాళ్వాకు నీరివ్వాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం



బంటుమిల్లి: పెడన నియోజకవర్గంలో రెండో పంట దాళ్వాకు సాగునీరివ్వాలంటూ పలు గ్రామాల రైతులు సోమవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. పెడన మండలం జింజేరు టీడీపీ నాయకుడు మట్టా వెంకటేశ్వరరావు నాయకత్వంలో పలువురు రైతులు నాగేశ్వరరావుపేట గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను కలసి రెండో పంటకు నీరివ్వాలని కోరారు. సంవత్సరాల తరబడి దాళ్వా లేక భూములు చౌడుబారి దిగుబడులు తగ్గుతున్నాయని, అపరాల సాగు వల్ల రైతులకు మేలు జరగదని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆందోళన పడవద్దని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజులపాటి సత్యనారాయణ, వేముల వెంకటప్రసాద్, కట్టా మధు, కట్టా మురళి, మోతుకూరి గోపాలస్వామి, శ్రీరామమూర్తి, నాంచారయ్య తదితరులున్నారు.

క్రీడాకారులకు అభినందన



గూడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు సెలక్షన్స్‌లో సత్తా చాటిన కప్పలదొడ్డి హైస్కూల్ విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని జ్యోతి పాఠశాల చైర్మన్ శివకృష్ణ అభినందించారు. అండర్–14 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన వి.సాయిసింధు, ఎం.హేమశ్రీ శ్యామల జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి అన్నమయ్య జిల్లా అంగళ్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అండర్–17 బాలుర విభాగంలో పి.పవన్, బి.రామన్, వి.విఘ్నేష్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 8న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ మురళీకృష్ణను కూడా అభినందించారు.

రైతుల సహకారంతో ముళ్లపొదల తొలగింపు



ఘంటసాల: ఘంటసాల – మల్లాయి చిట్టూరు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదల తొలగింపు పనులను ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల నుంచి మల్లాయి చిట్టూరుకు వెళ్లే రహదారిలో ముళ్ల చెట్లు రోడ్ల మీదకు వచ్చి రైతులు, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఘంటసాలలోని గృహ నిర్మాణ శాఖ గోడౌన్ దగ్గర నుంచి మల్లాయి చిట్టూరు వెళ్లే సుమారు 2 కిలోమీటర్ల మేర రూ.లక్షతో రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు మిక్కిలినేని మధు, వేమూరి వెంకటేశ్వరరావు, దోనేపూడి కిషోర్, దోనేపూడి బుజ్జి, గంజి రఫీ, వీర్ల రాంబాబు, ఇరత రైతులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గోగినేనిపాలెం(ఘంటసాల): ఉచిత బస్సు సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలంలో జెడ్పీ హైస్కూళ్లలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 100 మంది విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ అవనిగడ్డ డిపో వారు అందించిన బస్‌పాస్‌లను సోమవారం విద్యార్థులకు హెచ్‌ఎం వేణుగోపాలరావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీ డిపో మేనేజరుకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు నాదెళ్ల బసవేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ల జాబితా ప్రదర్శన


మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అనధికార లే అవుట్ల జాబితా

పెడన: పట్టణంలో అనధికార లే అవుట్ల జాబితాను మున్సిపల్ కార్యాలయం గోడపై ప్రదర్శించారు. పట్టణ వ్యాప్తంగా 43 లే అవుట్లను 2018లో అప్పటి మున్సిపల్ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం వారు గుర్తించారు. అప్పట్లో వీటిపై విజిలెన్స్‌కు భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అసలు ఎన్ని ఉన్నాయో గుర్తించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో వీటిని గుర్తించారు. అయితే రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో అనధికార లేఅవుట్ల వద్ద నోటీసు బోర్డులు పెట్టడానికి పురపాలక సంఘ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కౌన్సిల్ కనీసం మున్సిపల్ కార్యాలయం వద్ద అయినా జాబితా ప్రదర్శించాలని కోరడంతో అధికారులు ఆ మేరకు బోర్డును ఏర్పాటు చేశారు. సర్వే నంబర్లు, సదరు యజమాని పేరు ఈ బోర్డులో ప్రదర్శించారు. ఎటువంటి అనుమతులు లేవని, వీటిలో స్థలం కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇంటి పన్నులకు, కుళాయిల ఏర్పాటుకు, వీధి లైట్లు, సీసీ రోడ్లు తదితర వాటిని వేయడానికి, అభివృద్ధి చేయడానికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని కొనుగోలుదారులను హెచ్చరించే విధంగా ఈ బోర్డును ఏర్పాటు చేశారు.

యాదవ కల్యాణమండపం పనులకు శంకుస్థాపన


యాదవ కళ్యాణ మండపం శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో యాదవ కల్యాణ మండపం నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం శంకుస్థాపన చేశారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ నుంచి మంజూరైన రూ.50 లక్షలు, ఎస్‌హెచ్‌పీసీ లిమిటెడ్ నుంచి మంజూరైన రూ.55 లక్షలు మొత్తం రూ.1.05 కోట్లతో పాటు, ఎంపీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతుగా రూ.25 లక్షలు విరాళంగా అందించనున్నట్లు ప్రకటించారు. నగరంలో బీసీ భవన్, అంబేడ్కర్ భవన్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మరో మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బీసీ సంఘ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ, మాజీ కౌన్సిలర్ నాలి మాధవరావు పాల్గొన్నారు.

135 మంది సిబ్బందితో నాగుల చవితికి బందోబస్తు

అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్


మోపిదేవిలో పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్

మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నాగుల చవితి సందర్భంగా మంగళవారం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోలీస్ ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 135 మంది సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలతో పాటు పోలీస్ అధికారులు, హోంగార్డులు ఉంటారని వివరించారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నియంత్రించాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశంలోనే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. చల్లపల్లి, అవనిగడ్డ సీఐలు ఈశ్వరరావు, యువకుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు నాగులచవితి వేడుకలకు ఏర్పాట్లు

నాగాయలంక: నాగులచవితి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం మండలంలోని పలు దేవాలయాల్లో నాగపుట్టలలో పాలు పోసే భక్తులకు ఏర్పాట్లు చేశారు. నాగాయలంకలోని పురాతనమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నాగపుట్టలలో పాలు పోసి, స్వామివారిని దర్శించుకునేందుకు సర్వం సిద్ధం చేశామని ఆలయవర్గాలు తెలిపాయి. మండలంలో మర్రిపాలెం–నంగేగడ్డ శ్రీశివనాగరాజ స్వామి దేవస్థానంలో భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు నిజాంపట్నం నరసింహమూర్తి చెప్పారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


ఎస్పీ గంగాధరరావు చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకున్న సునిధి, ఆమె తల్లిదండ్రులు

కోనేరుసెంటర్: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో గత విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు సోమవారం తన కార్యాలయంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టాలనే సదుద్దేశంతో ఈ పోటీలు నిర్వహించామన్నారు. కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలో మొదటి బహుమతిని సునిధి పట్నాయక్(నాగాయలంక) రూ.5000, రెండవ బహుమతిని కె.నాగదినేష్ (వీరవల్లి) రూ, 3000, మూడవ బహుమతిని ఎం.ప్రతిమ(హనుమాన్‌జంక్షన్) రూ.2000 పొందారు. పోలీసులు, వారి పిల్లలకు నేటి సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపై నిర్వహించిన పోటీలో మొదటి బహుమతిని ఉప్పాల వార్షితకీర్తి రూ.5000 (ఘంటసాల), రెండవ బహుమతిని రెడ్డి చరణ్‌తేజ్ (చిలకలపూడి) రూ.3000 పొందారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్), ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి రెడ్‌క్రాస్ చేయూత

కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలు గోవాడ లక్ష్మికి రెడ్‌క్రాస్ మండలశాఖ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. బాధితురాలికి గృహోపకరణాలు, 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరకులు, కూరగాయలను సొసైటీ సభ్యులు అందించారు. ప్రభుత్వం బాధితురాలిని ఆదుకోవాలని కోరారు. శాఖ మండల అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, సభ్యులు జొన్నా రవిశంకర్, రేపల్లె యోగప్రకాష్, గోనా వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సహాయం అందించాలి


సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామారావు

అవనిగడ్డ: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ప్రతి ఎకరాకు రూ.20 వేల పెట్టుబడి సహాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామారావు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా చల్లపల్లి మండలం వక్కలగడ్డలో గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, కొల్లూరి శ్రీధర్, దాసరి గోపాలకృష్ణ, పి.శేషు పాల్గొన్నారు.

దేవరకోట(ఘంటసాల): మండలంలోని దేవరకోట గ్రామ సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శి సీహెచ్ కాంతారావుకు సోమవారం ఏపీ రైతు సంఘం నేతలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, వేమూరి రత్నగిరి, రైతు నాయకులు హనుమానుల సాయిబాబు, సీపీఐ నేతలు మల్లుపెద్ది లెనిన్, కొల్లూరి శ్రీధర్, దాసరి గోపాలకృష్ణ, ఆర్‌ఎంపీ శేషు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడులు

- 11మంది పందెంరాయుళ్లు అరెస్టు
- ఎనిమిది ద్విచక్రవాహనాలు, రూ.16,920 నగదు సీజ్

కోడూరు: కోడిపందేల శిబిరంపై కోడూరు పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. మండలంలోని మాచవరం సమీపంలో పందెంరాయుళ్లు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక బరి ద్వారా కోడిపందేలను నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన పందెంరాయుళ్లు ఈ బరి వద్ద పందేలు వేసేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో మాచవరం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన 11 మంది పందెంరాయుళ్లను అరెస్టు చేశారు. వీరి వద్ద ఉన్న తొమ్మిది కోడిపుంజులను, నాలుగు కోడి కత్తులతో పాటు రూ.16,920 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చాణిక్య తెలిపారు. శిబిరం వద్ద ఉన్న ఎనిమిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

బంటుమిల్లి: మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై సోమవారం పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయములో మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామానికి చెందిన నడకుదిటి కృష్ణ బంటుమిల్లిలో మద్యం దుకాణం వద్ద కొన్న 27 మద్యం సీసాలు తీసుకుని వెళుతుండగా తనిఖీల్లో పోలీసులకు చిక్కాడు. పోలీసులు కృష్ణపై కేసు నమోదు చేసి అతని వద్ద ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా లక్ష్మీకుమారి

నాగాయలంక: స్థానిక వెలుగు కార్యాలయంలో నాగాయలంక మండల మహిళా సమాఖ్య నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక సోమవారం జరిపినట్లు సంస్థ ఏపీఎం కె.వై.దాస్ తెలిపారు. సమాఖ్య అధ్యక్షురాలిగా బీసాబత్తుని లక్ష్మీకుమారి(టి.కొత్తపాలెం), కార్యదర్శిగా రేమాల దుర్గాప్రసన్న (రేమాలవారిపాలెం), కోశాధికారిగా సజ్జా ఉదయలక్ష్మి(నాగాయలంక), ఉపాధ్యక్షురాలిగా మద్ది లంకేశ్వరి(మర్రిపాలెం), సంయుక్త కార్యదర్శిగా నాయుడు లక్ష్మి(నాలి) ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు.

నేడు నూతన వంతెన ప్రారంభం

కోడూరు: మండలంలోని లింగన్నకోడు డ్రైన్‌పై నరసింహపురం వద్ద నిర్మించిన నూతన వంతెనను మంగళవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని కూటమి నేతలు సోమవారం తెలిపారు. ఉదయం 10గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్స్యకారులకు ఐస్ బాక్స్‌లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

రామకృష్ణాపురం రహదారికి మరమ్మతులు

కోడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామకృష్ణాపురం రహదారికి మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. రహదారి మరమ్మతులకు రూ.72 లక్షల నిధులు కేటాయించి, ఈ పనులకు ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో శ్రీకారం చుట్టారు. రహదారి పొడవునా గుంతలు ఉండడంతో వీటిని తారుతో పూడ్చివేస్తున్నారు. ఎనిమిది కిలోమీటర్ల మేర ఈ మరమ్మతులు చేయనున్నట్లు అధికారులు చెప్పారు.